ఉచిత వైద్య శిబిరాలు వినియోగించుకోవాలి

మూసాపేట: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కాంగ్రెస్ పార్టీ మూసాపేట డివిజన్ మాజీ అధ్యక్షుడు చున్నూ పాషా పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు మూసాపేట గూడ్స్ షెడ్ రోడ్డులోని రాయల్ ఫంక్షన్ హాలు వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరంలో షుగర్, థైరాయిడ్, జనరల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరిసర ప్రాంతాల వాసులు ఈ వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

జేఎన్‌టీయూను సందర్శించిన నూతన ఇన్‌చార్జి వీసీ

బాలానగర్: జేఎన్‌టీయూ నూతన ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా నియమితులైన బుర్రా వెంకటేశం శనివారం వర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను వైస్ చాన్సలర్ ఛాంబర్‌లో రెక్టర్ కె. విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డా. కె. వెంకటేశ్వరరావుల సమక్షంలో యూనివర్సిటీలోని డైరెక్టర్‌లను, కళాశాల ప్రిన్సిపాల్, క్యాంపస్ కాలేజీలోని పలు డిపార్టుమెంట్‌లలో పనిచేస్తున్న, ఆచార్యులను, హెచ్‌ఓడీలను పరిచయం చేశారు. ఈ సందర్భంగా బుర్రా వెంకటేశం మాట్లాడుతూ విద్యార్థుల అవసరాన్ని గుర్తించి ఉత్తమ విద్యాబోధన చేయాలన్నారు. ఎటువంటి సమస్య ఉన్నా స్వయంగా నా దృష్టికి తీసుకువస్తే న్యాయం చేస్తానని తెలిపారు.

కాంగ్రెస్‌తోనే నిరుద్యోగులకు న్యాయం

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ పార్టీ పాలనలోనే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందని పలువురు పేర్కొన్నారు. శనివారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా జరిగిన కార్యక్రమంలో కేయూ ప్రొ.వీరన్న, ఓయూ జేఏసీ చైర్మన్ ఓరుగంటి కృష్ణ, డా.శంకర్, డా.విష్ణు మాట్లాడుతూ.. తీన్‌మార్ మల్లన్నను గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మోతీనగర్: తెలంగాణ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న రెగ్యులర్, ఆర్టిజన్, అన్‌మెన్, పీస్‌రేట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్ఎన్ఎం పాషా గ్రీన్‌ల్యాండ్స్ డివిజన్ ఇంజనీర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల ముఖ్యమైన సమస్యలను ఫిబ్రవరి 26న యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లామని, ఇంతవరకు అవి పరిష్కారం కాలేదన్నారు. యాజమాన్యం ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలని కోరామన్నారు. ఆర్టిజన్ కార్మికులందరినీ విద్యార్హతను బట్టి జెఎల్ఎం, జేపీఏ, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్, సబ్ ఇంజనీర్ తదితర రెగ్యులర్ పోస్టులకు కన్వర్షన్ ఇవ్వాలని, అన్‌మ్యాన్ వ్యవస్థను రద్దు చేసి ఆ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలని, వారికి ఆర్టిజన్‌లతో సమానంగా వేతనం అందజేయాలని కోరారు. ఒకే సంస్థ ఒకే సర్వీస్ రూల్స్ అమలు చేయాని, పీస్ రేట్‌కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రంలో కోరామన్నారు. ఏపీఎస్ఇబీ కాలం నుంచి మన సంస్థను నమ్ముకొని పనిచేస్తున్నట్టువంటి ప్రైవేట్ మీటర్ రీడర్లు, బిల్ కలెక్టర్స్, టిఆర్ఐఎ కార్మికులు, ఈఆర్‌ఓలో పిపిఎ కార్మికులు, సెక్యూరిటి గార్డులు, వాచ్ అండ్ వార్డు కార్మికుల సేవలను గుర్తించి మన సంస్థలో విలీనం చేసుకొని ఆర్టిసన్స్‌గా గుర్తించాలని, కనీస వేతనం జీవో అమలు చేసి కనీస వేతనాలు, ఈఎస్ఐ, పిఎఫ్ , మెడికల్ క్రెడిట్ కార్డు సౌకర్యం వంటివి కల్పించాలని కోరామని డివిజన్ అధ్యక్షుడు ఎస్ఎన్ఎం పాషా పేర్కొన్నారు.

ఐడీఎల్ చెరువుపై అపరిశుభ్రంగా వాకింగ్ ట్రాక్

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువుపై ఉన్న వాకింగ్ ట్రాక్‌పై చెత్తా చెదారం పేరుకుపోతోంది. మొక్కల కొమ్మలు కూడా ట్రాక్‌ను ఆక్రమించటంతో వాకింగ్ చేసేవారికి ఇబ్బందిగా ఉంది. దుమ్ము, ధూళి అలాగే ఉండటంతో వాకర్స్ ఇబ్బంది పడుతున్నారు. ఆరోగ్యం కోసం ఉదయం వాకింగ్‌కు వెళితే దుమ్ము, ధూళి లేచి అనారోగ్యం పాలవుతున్నాం అని వాకర్స్ వాపోతున్నారు. కనీసం ట్రాక్‌పైన కూడా శుభ్రం చేయటం లేదని, రోడ్డుపై శుభ్రం చేసిన చెత్తను కూడా ట్రాక్ పక్కనే పడవేస్తున్నారని తెలిపారు.పలు మార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వాకింగ్ ట్రాక్‌ను శుభ్రం చేయాలని కోరుతున్నారు.

సీఆర్ ఫౌండేషన్‌లో వరల్డ్ ఫ్యామిలీ డాక్టర్స్ డే

హఫీజ్‌పేట్: వరల్డ్ ఫ్యామిలీ డాక్టర్స్ డే సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఏపీఎఫ్‌టీ చాప్టర్ ఆధ్వర్యంలో శనివారం కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లోని వృద్ధాశ్రమంలో న్యూట్రిషియన్ ఫర్ ద ఎల్డర్లీ అనే అంశంపై వృద్ధులకు ఎలాంటి పోషక ఆహారం అవసరంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూకె ఎఫ్ఆర్‌సీజీపీ డాక్టర్ కిరణ్మయి, తెలంగాణ రాష్ట్ర ఏఎఫ్‌పీఐ ప్రెసిడెంట్ ఫ్యామిలీ డాక్టర్స్ ఆవశ్యకత ఎంత ముఖ్యమో వారు వివరించారు. అనంతరం న్యూట్రిషన్ అండ్ డయాబెటిస్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ వసుంధర మాట్లాడుతూ ముఖ్యంగా షుగర్, రక్తపోటు ఉన్నవారు ఎలాంటి ఆహారం తీసుకోవాలో వివరించారు.కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవరావు, హెల్త్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రజిని, వృద్ధులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతే లక్ష్యం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న శానిటరీ సూపర్‌వైజర్ జలంధర్‌రెడ్డి, సిబ్బంది

రాయదుర్గం: కాలనీలు, బస్తీలలో పరిశుభ్రమైన వాతావరణమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, అందుకు ప్రజలు కూడా సహకరించాలని జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ శానిటరీ సూపర్‌వైజర్ జలంధర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం గచ్చిబౌలి డివిజన్‌లోని జర్నలిస్ట్ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, సోఫాకాలనీ, తాజ్‌నగర్ ప్రాంతాలలో చెత్తను స్వచ్ఛ ఆటోలకు అందించాలని అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోనల్ కమిషనర్ స్నేహశబరీష్, సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి ఆదేశాలపై కాలనీలు, బస్తీలలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. పలుచోట్ల రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో కొందరు చెత్తను వేస్తున్నారని అలా వేయకుండా అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ప్రతికాలనీ, బస్తీలో చెత్త సేకరణకు రిక్షాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇంట్లోనే కాకుండా పరిసరాల్లో, కాలనీ, బస్తీల్లో రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్ రిసోర్స్‌పర్సన్ పద్మజ, రాంకీ సంస్థ ప్రతినిధులు, శానిటరీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

‘సెల్లార్’ టెన్షన్ లేకుండా...

● ముందస్తు చర్యలకు సిద్ధమైన అధికారులు ● సెల్లార్లలో నీరు చేరకుండా ఏర్పాట్లు ● యజమానులకు నోటీసులు

కుత్బుల్లాపూర్: వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యలకు సిద్ధమయ్యారు జంట సర్కిళ్ల అధికారులు. ఆయా సర్కిళ్ల వారీగా సెల్లార్ నిర్మాణం చేపట్టి కమర్షియల్ యాక్టివిటీస్ చేపడుతున్న వారిని గుర్తించి నోటీసులు జారీ చేస్తున్నారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లలో ఉన్న సెల్లార్లను గుర్తించి వర్షాకాలంలో నీరు చేరి సదరు బిల్డింగ్ ఇబ్బందికరంగా ఉన్న వాటిని మొదటి విడతల గుర్తించి నోటీసులు అందజేస్తూ వస్తున్నారు. వెంటనే వాటిని తొలగించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే జంట సర్కిళ్ల పరిధిలో పలువురికి మొదటి నోటీసులు అందజేశారు.



గంగా ఎన్‌క్లేవ్‌లో సెల్లార్‌తో పాటు నిర్మాణంలో ఉన్న ఓ భవనం..

ఇప్పటికే 54 మందికి నోటీసులు జారీ..

కుత్బుల్లాపూర్‌లో 41, గాజులరామారంలో 13 సెల్లార్ కిందివి సర్కిళ్ల పరిధిలో ఇప్పటికే 54 మందికి నోటీసులు జారీ చేసి కమర్షియల్‌గా వినియోగిస్తున్న వాటిని గుర్తించి తొలగించాలని కోరారు. గతంలో వర్షం పడగా సెల్లార్లలో నీరు చేరి రెండు మూడు రోజులపాటు వాటిని మోటార్ల ద్వారా బయటకు తొలగించే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్ రోస్ ఆదేశాలతో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ ఉత్తర్వులు జారీ చేయగా.. జంట సర్కిళ్ల ఉప కమిషనర్లు మల్లారెడ్డి , నరసింహులు గత వారం రోజులుగా టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి సెల్లార్లల్లో కమర్షియల్ నిర్మాణాలను గుర్తించి వాటిని తొలగించుకోవాలని, లేనిపక్షంలో తామే తొలగిస్తామని హెచ్చరిస్తూ నోటీసులు జారీ చేస్తూ వస్తున్నారు. సదరు యజమానులు నోటీసులు తీసుకుంటున్నప్పటికీ వాటిని ఖాళీ చేస్తారా.. లేదా.. అన్నది ప్రశ్నగా మారింది. దీనిపై అధికారులు ఎలా స్పందిస్తారు ..అన్నది వేచి చూడాల్సిందే.

వర్షాకాలంలోనే హడావిడి..

2020లో భారీ వర్షాల వల్ల కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో సెల్లార్లు నిండి రెండు మూడు రోజులు నిద్ర కూడా కరువైంది. ప్రజలు లక్షలాది రూపాయలు వెచ్చించి అపార్ట్‌మెంట్ ఫ్లాట్లను కొనుగోలు చేసి అందులో ఉంటుండగా.. వర్షాకాల సమయంలో తాము ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యను బిల్డర్ మాత్రం పట్టించుకోకపోవడం.. సెల్లార్ వర్షపు నీటితో నిండి కిందకు దిగలేని పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా నిజాంపేట్ ప్రాంత పరిధిలో ఈ సమస్య తీవ్రంగా ఉండగా జంట సర్కాళ్లల పరిధిలో గాజులరామారం ప్రాంతంలో ఈ సమస్య తీవ్రంగా మారింది. కొన్ని సందర్భాల్లో అపార్ట్‌మెంట్‌లోకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఇలా ప్రజలు ఇబ్బందులు పడుతూ కాలం వెళ్లదీశారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యలు చేపట్టిన అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తే తప్పకుండా ఫలితం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. వర్షాకాల సమయంలోనే అధికారులు హడావిడి చేసి తర్వాత ఆ ఊసే ఎత్తకుండా ఉండడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం నోటీసులు జారీ చేసి బెదిరింపులకు దిగి నోటీసుకు ఇంత చొప్పున వసూళ్లు చేసిన ఘటనలు కూడా ఉన్నాయని పుకార్లు.. షికార్లు చేస్తున్నాయి. ఏది ఏమైనా శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేయాలని ఆశిద్దాం.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



వేడుకల్లో పాల్గొన్న జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్, ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిల్ ఆవరణలో ఉన్న శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎల్లమ్మ ఆలయ పునః ప్రతిష్టాపన అనంతరం మొదటి సారిగా నిర్వహించిన వార్షికోత్సవ పూజా కార్యక్రమాల్లో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. అమ్మవారి కృపా కటాక్షాలు సర్కిల్ అధికారులు, సిబ్బందిపై ఎల్లవేళలా ఉండాలని జోనల్ కమిషనర్ అన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: దూలపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మెయింటెన్స్, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో ఆటంకాలు కలుగనున్నాయని కొంపల్లి సెక్షన్ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ కేకే సొసైటీ ఫీడర్ పరిధిలో ఉదయం 10గంటల నుండి 11.30 గంటల వరకు దూలపల్లి ఇండస్ట్రీయల్ ఏరియా, హనుమాన్ వేబ్రిడ్జి, చౌదరి వేబ్రిడ్జి ప్రాంతాల్లో, ఐడీఏ-2 ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుండి 11.30 గంటల వరకు ఇండస్ట్రీయల్ మొత్తం ప్రాంతంలో, ప్రశాంత్‌నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2గంటల నుండి 3.30గంటల వరకు హరియానా వేబ్రిడ్జి, మజీద్ గల్లీ, డెక్కన్ కాంటా లేన్, ఇండస్ట్రీయల్ ఏరియాలో, ఐడీఏ-1 ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుండి 3.30 గంటల వరకు అయ్యప్పస్వామి ఆలయం రోడ్డు, దూలపల్లి ఇండస్ట్రీ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పేర్కొన్నారు.

◆ **నిజాంపేట్:** విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అవాంతరాలు తలెత్తనున్నాయని బౌరంపేట్ ఏఈ సాయికిరణ్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ మిలినియన్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మిలినియన్ ఇండస్ట్రీ ప్రాంతం, ఎస్‌వీబీకే ఫంక్షన్ హాలు, గండిమైసమ్మ ప్రాంతాలు, 11కేవీ ఐడీఏ-2 ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుండి 3.30 గంటల వరకు జ్యోతిమిల్క్, హైటెక్ ఇండస్ట్రీ, బహదూర్‌పల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

◆ **దుండిగల్:** డి.పోచంపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఫీడర్ మరమ్మత్తుల కారణంగా ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని బౌరంపేట ఏఈ సాయికిరణ్ తెలిపారు. మిలీనియం ఇండస్ట్రీ ఏరియా, ఎస్‌వీబీకే ఫంక్షన్ హాల్, గండిమైసమ్మ పరిసర ప్రాంతాలు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 3.30 వరకు జ్యోతి మిల్క్ ఇండస్ట్రీ ఏరియా, హైటెక్ ఇండస్ట్రీ, బహదూర్‌పల్లి ప్రాంతాల్లో సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎక్కడ పడితే అక్కడ చెత్త

రంగారెడ్డినగర్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదని అధికారులు ఎన్ని అవగాహన సదస్సులు నిర్వహించినా ప్రజల్లో చైతన్యం రావడం లేదు.. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తున్నారు. ఏపీహెచ్‌బీ కాలనీని ఆనుకుని గుడెన్‌మెట్ రోడ్డులో చెత్త వేస్తుండటంతో అధికారులు ఆ ప్రాంతంలో పారబోయద్దని, జరిమానా విధిస్తామని బ్యానర్ ఏర్పాటు చేశారు. అయితే ఇవేమీ తమకు పట్టవన్నట్లు స్థానికంగా ఉన్న ఇళ్ల వాసులు చెత్తను యదావిధిగా వేస్తుండటంతో చెత్తసేకరణ కార్మికులు తలలు పట్టుకుంటున్నారు. ఇళ్ల వద్దకు వచ్చే చెత్తసేకరణ ఆటో రిక్షావాలాలకు చెత్తను అందజేసి బహిరంగ ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులు కోరుతున్నారు.



హెచ్చరిక బ్యానర్ ఏర్పాటు చేసిన చోటే చెత్త వేస్తున్న దృశ్యం

మహిళ కిడ్నాప్.. ఛేదించిన పోలీసులు


సుభాష్‌నగర్: సూరారం పోలీసులు చాకచక్యంతో కిడ్నాప్‌కు గురైన మహిళ సురక్షితంగా విడిపించారు. ఈ ఘటనలో కిడ్నాప్‌కు యత్నించిన నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. సూరారం కాలనీ సుందర్‌నగర్‌కు చెందిన జీహెచ్ఎంసీ తాత్కాలిక ఉద్యోగి లక్ష్మణ్ రావు, రాణిలు భార్యాభర్తలు. కాగా 24వ తేదీన లక్ష్మణ్‌రావు పనినిమిత్తం కర్నూలుకు వెళ్లగా రాణి ఇంట్లోనే ఉంది. ఈ క్రమంలో శనివారం లక్ష్మణ్‌రావుకు అప్పు ఇచ్చిన కొందరు వ్యక్తులు రాణిని ఆటలో బలవంతంగా తమ వెంట తీసుకువెళ్లారు. ఈ విషయాన్ని ఫోన్ ద్వారా రాణి తన కుమారుడు వరుణ్‌కు చెప్పింది. దీంతో కుటుంబ సభ్యులు సూరారం పోలీసులను ఆశ్రయించగా వెంటనే అప్రమత్తమై ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా కిడ్నాపర్లను పట్టుకుని రాణిని సురక్షితంగా విడిపించారు. కిడ్నాప్‌కు పాల్పడిన ఇద్దరు మహిళలు, ఇద్దరు వ్యక్తులను సూరారం పోలీసులు విచారిస్తున్నారు. కాగా ఈ కేసు విషయంలో మరే ఇతర విషయాలను పోలీసులు వెల్లడించడం లేదు.

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

లిబర్టీ: అన్నింటా వెనుకబడి ఆటో నడుపుకొంటూ దయనీయ జీవితాలు వెళ్లదీస్తున్న ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత అసంఘటిత కార్మికుల, ఉద్యోగుల సంఘం ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష మల్లేష్ ఆర్టీఏ అధికారులకు విన్నవించారు. ఈ మేరకు ఆర్టీఏ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఆటో డ్రైవర్లకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ఆర్టీఏ అధికారుల వేధింపులు ఆపాలని, ఆటోలు కొనుగోలు చేయడానికి లైసెన్స్ ఉన్న ప్రతి డ్రైవర్‌కు రుణాలు ఇప్పించాలని మల్లేష్ విన్నవించారు. గత ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఆటో డ్రైవర్ కుటుంబానికి రూ. 12 వేలు చెల్లించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టించి ఇవ్వాలని జ్ఞప్తి చేశారు. హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఫరూక్ పాల్గొన్నారు.

రూ.8.4 లక్షల విలువైన హష్ ఆయిల్ స్వాధీనం

ముగ్గురి అరెస్ట్



పోలీసులు అరెస్టుచేసిన నిందితులు

సుభాష్‌నగర్: మత్తు పదార్థాలను తరలిస్తున్న ముగ్గురు వ్యక్తుల నుండి రూ. 8.4 లక్షల విలువ చేసే హష్ ఆయిల్‌ను సూరారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయిబాబానగర్ చౌరస్తాలో ఈ నెల 24న పోలీసులు వాహనాలు తనిఖీలు చేపట్టగా బైక్‌పై అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురు వ్యక్తులు తప్పించుకునే యత్నం చేశారు. వారిని పట్టుకుని పోలీసులు విచారించగా బైక్ డిక్కీలో 1.760 గ్రాముల హష్ ఆయిల్ (మత్తు పదార్థం) పట్టుబడింది. నిందితులు సూరారం వెంకట్రామ్‌నగర్‌కు చెందిన గడ్డం ఉదయ్‌కిరణ్(24), సీతారామరాజు (28), సూరారం శ్రీకృష్ణనగర్‌కు చెందిన బట్టు శ్రావణ్‌కుమార్(23)లు ఒడిస్సా కోరాపూట్ నుంచి ట్రైన్‌లో హష్ ఆయిల్‌ను నగరానికి తీసుకువచ్చే క్రమంలో పోలీసులకు దొరకకుండా బీబీనగర్‌లో రైలు దిగి హోండా యాక్టీవాపై సూరారానికి వస్తుండగా పట్టుబడ్డారు. నిందితులను మేడ్చల్ కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించగా చర్లపల్లి జైలుకు తరలించారు.

తాను మరణించి ప్రాణదాత అయింది



సౌభాగ్యమ్మ (ఫైల్)

నిజాంపేట్: తాను చనిపోయి మరొకరికి ప్రాణదాత అయింది ఆ మహిళ.. వివరాల్లోకి వెళితే.. నిజాంపేట్‌కు చెందిన బీజేపీ నాయకుడు కాంతారావు భార్య సౌభాగ్య ప్రమాదవశాత్తు కింద పడడటంతో బ్రెయిన్ డెడ్ అయింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమె అవయవాలను ఇతరులకు ఉపయోగపడేలా దానం చేశారు. సౌభాగ్యకు చెందిన ఊపిరితిత్తులను కిమ్స్ ఆస్పత్రికి, ఒక కిడ్నీ నిమ్స్ ఆస్పత్రి, మరో కిడ్నీ, లివర్‌ను యశోధ ఆస్పత్రిలో అవసరమున్న వారికి దానం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలోని ‘నాన్ సీఓఈ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్)’ గురుకుల విద్యాలయాల్లో జూనియర్ ఇంటర్మీడియట్‌లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపల్ ఏ శారద శనివారం తెలిపారు. పదవ తరగతి పాసైన విద్యార్థులు ఈనెల 31వ తేదీ వరకు గురుకుల సొసైటీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ, వృత్తివిద్యా కోర్సుల్లో సీట్లు ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు రుసుము ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బందోబస్తు మధ్య కృత్రిమ నాలా పనులు



పోలీసు బందోబస్తు మధ్య కృత్రిమ నాలా పనులు చేపడుతున్న అధికారులు..

సుభాష్‌నగర్: నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారంటూ నిలిపివేసిన కృత్రిమ నాలా పనులను ఎట్టకేలకు జీహెచ్ఎంసి, ఇరిగేషన్ శాఖ అధికారులు పోలీస్ బందోబస్తు మధ్య ప్రారంభించారు. గాజులరామారం డివిజన్ ఓక్షిత్ ఎంక్లేవ్ 1,2, కాలనీల్లో రోడ్డు నెంబర్ 4,2 మీదుగా రూ.18 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నాలా పనులను గత వారం రోజుల క్రితం కాలనీవాసులు అడ్డుకున్నారు. కబ్జా చేసిన కట్టు కాలువను వదిలి పెట్టి మా ఇళ్ల మధ్య నుంచి పనులు చేపట్టడమేంటని పనులు నిలిపివేశారు. ఈనెల 22న ఉప కమిషనర్ మల్లారెడ్డి పోలీస్ బందోబస్తు మధ్య వచ్చిన కాలనీవాసులు వినకపోవడంతో వెనక్కి తిరిగారు. తాజాగా శనివారం జీహెచ్ఎంసి డీఈ రూప దేవి భారీ పోలీసు బందోబస్తు మధ్య ఉదయం అక్కడికి చేరుకుని కృత్రిమ నాలా పనులను ప్రారంభించారు. విషయం తెలుసుకున్న కాలనీ వాసులు అక్కడికి చేరుకుని పనులను నిలిపి వేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, అధికారులు, కాలనీవాసుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ విషయమై కోర్టును ఆశ్రయిస్తామని కాలనీ వాసులు పేర్కొన్నారు.



పోలీసులతో వాగ్వివాదానికి దిగిన కాలనీ వాసులు..

సదుపాయాల కల్పనకు కృషి

సుభాష్‌నగర్: మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామని గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. శనివారం డివిజన్ పరిధి మహాదేవపురం నుండి రావినారాయణరెడ్డినగర్ ప్రధాన రహదారిలోని సెయింట్ ఆల్ఫోన్సస్ హైస్కూల్ సమీపంలో పెండింగ్ నాలా పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలా పనులు పూర్తయితే స్థానికంగా డ్రైనేజీ సమస్యతో పాటు వరదనీరు చేరకుండా ఉంటుందని, త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఆయన వెంట నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, ప్రసాద్, మహేశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డి, ఎస్.వి.రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



నాలా పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రావుల శేషగిరి..

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



అన్న ప్రసాదం అందజేస్తున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: గాజులరామారంలోని హనుమాన్ ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ తనయుడు కూన కృష్ణాగౌడ్ హనుమాన్ మాలధారణ సందర్భంగా శ్రీశైలంగౌడ్, కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్, కూన జైకుమార్‌గౌడ్‌లు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హనుమాన్ మాలాధారులు పూజల్లో పాల్గొని భజనలు చేయడంతో స్థానికంగా ఆధ్యాత్మికత సంతరించుకుంది. అనంతరం హనుమాన్ మాల ధరించిన స్వాములకు, భక్తులకు అన్న ప్రసాదం అందించారు. అంజని పుత్రుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని శ్రీశైలంగౌడ్ అభిలాషించారు.

పిల్లలకు మంచి నడవడిక నేర్పించాలి



శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

జగద్గిరిగుట్ట: పిల్లలకు మంచి నడవడిక, ఆహార అలవాట్లతో పాటు మంచి సాంగత్యపద్ధతులను నేర్పించాలని ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి అన్నారు. జగద్గిరిగుట్టలోని మాణికేశ్వరి ఆలయంలో విఠల్‌రెడ్డి సౌజన్యంతో బాల సంస్కార శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు శనివారం సర్టిఫికెట్ల ప్రదానోత్సవం నిర్వహించగా ఎలక్షన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు చిన్ననాటి నుండే నీతి పద్యాలు, శతకాలు, స్తోత్రాలు, శ్లోకాలు నేర్పించాలన్నారు. మన సంస్కృతి సాంప్రదాయాలపై అవగాహన కల్పించి మంచి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ఆశ్రమ వ్యవస్థాపకుడు మల్లికార్జున స్వామి, వీరాచార్య స్వామి లు విచ్చేసి పలు సూచనలు. సందేశాన్ని ఇచ్చారు.

తల్లి, పిల్లలను కాపాడిన పోలీసులు

సుభాష్‌నగర్: తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఇంటి నుండి వెళ్లిపోయిన మహిళను సూరారం పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం భవానీనగర్‌కు చెందిన మౌనిక(27) భర్త చనిపోవడంతో తన ఇద్దరు పిల్లలు దేశ్‌మంత్(9), సత్య(7)లతో తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఈ నెల 25న ఉదయం 10.30గంటల సమయంలో ఇంట్లో చెప్పకుండా మౌనిక తన ఇద్దరు పిల్లలను తీసుకువెళ్లిపోయింది. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల, బంధువుల ఇళ్లల్లో వాకబు చేసినా ఫలితం లేకపోయింది. ఆమె మొబైల్ సైతం స్విచ్ఛాఫ్ రావడంతో సూరారం పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేశారు. కాగా తాను ఫతేనగర్ రైల్వే ట్రాక్‌పై ఉన్నానని మౌనిక కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తెలపడంతో ఈ విషయాన్ని సూరారం పోలీసుకులకు సమాచారం అందించారు. వెంటనే అప్రమత్తమైన ఫతేనగర్ చేరుకుని మొబైల్ సిగ్నల్స్ ఆధారంగా మహిళ ఆచూకీని గుర్తించారు. మౌనిక, ఇద్దరు పిల్లలను క్షేమంగా స్టేషన్‌కు తీసుకుచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా ఎందుకు ఇంటి నుండి వెళ్లిపోయిందన్న సమాచారం తెలియరాలేదు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కుత్బుల్లాపూర్: టిప్పర్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలైన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది..పోలీసులు తెలిపిన మేరకు.. గుండ్లపోచంపల్లికి చెందిన నాగరాజు జోమాటాలో పని చేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో మైసమ్మగూడ నుండి బహదూర్‌పల్లి వైపు టీవీఎస్ పై వెళ్తుండగా వెనుక నుండి వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టింది.ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన నాగరాజును శ్రీకర ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.